క్లుప్తంగా

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ఆపద మిత్రలకు సర్టిఫికెట్లు అందజేసిన వైస్ ప్రిన్సిపాల్ తదితరులు

సామర్లకోట: ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడిన సమయంలో బాధితులకు సహాయ కార్యక్రమాలు నిర్వహించడానికి ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఆపదమిత్రల మొదటి బ్యాచ్ శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై 12 రోజులుగా పొందిన శిక్షణ అంశాలను అడిగి తెలుసుకున్నారు. విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేసి, ప్రాణ నష్టం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిసెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్, విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజరు కిరణ్మయి, ఈటీసీ ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, బి.ఆంజనేయులు, ఎంఎస్ఎన్ రెడ్డి, కేఆర్ నిహారిక, వి.ప్రసాద్, ఎస్కె మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, ఉత్తమ శిక్షణ పొందిన వారికి మెమెంటోలు అందజేశారు.

నూకాలమ్మతల్లికి రజత హారం సమర్పణ



అమ్మవారికి హారాన్ని సమర్పిస్తున్న దాతలు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మతల్లికి గ్రామానికి చెందిన ఒబిలిశెట్టి నాగభూషణం, విజయలక్ష్మి దంపతులు శుక్రవారం 120 గ్రాముల వెండి హారాన్ని సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఈఓ టీవీ సూర్యనారాయణ సమక్షంలో వేద పండితులు అమ్మవారికి హారాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో గవరసాని రాజశేఖర్, రాంబాబు, సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

స్వర్ణ, రజత పుష్పాలతో మరిడమ్మకు పూజలు



అమ్మవారిని స్వర్ణ, రజత పుష్పాలతో అర్చిస్తున్న పండితులు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లికి శుక్రవారం స్వర్ణ, రజత పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు స్వర్ణపుష్పాలతో పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో శాంతియాత్ర



శాంతి యాత్ర చేస్తున్న ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సభ్యులు

పిఠాపురం: త్రిమూర్తి శత జయంతి సందర్భంగా గొల్లప్రోలు ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం గొల్లప్రోలులో శాంతి యాత్ర నిర్వహించారు. గొల్లప్రోలు ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం కార్యాలయం వద్ద భారీ శివలింగం ఏర్పాటు చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పుర వీధుల్లో శాంతి యాత్ర చేసి ప్రపంచ శాంతి వర్ధిల్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సభ్యులు పాల్గొన్నారు.

రాజప్పకు నిరసన సెగ

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెంలో దివంగత ఎమ్మెల్యే బొడ్డు భాస్కరరామారావు విగ్రహాన్ని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొడ్డు అభిమానులు చినరాజప్పకు వ్యతిరేకంగా నినాదాలు చేసి, చంద్రబాబును గోబ్యాక్ అని నిరసన తెలిపారు. చంద్రబాబు మాట్లాడుతూ ఇది టీడీపీ సంప్రదాయం కాదని, మీ ఎమ్మెల్యేను, మీ నాయకుడిని అగౌరవపర్చడం మంచిది కాదని వారికి సర్ది చెప్పారు. రాజప్ప మాట్లాడుతూ భాస్కరరావు మంచి రాజకీయ నాయకుడని తెలిపారు. అనంతరం మండల పరిధిలో చంద్రబాబు రోడ్డు షో ముగిసి అనపర్తికి చేరుకుంది.

మహా శివరాత్రికి సర్వం సిద్ధం

- నేడు పంచారామ క్షేత్రంలో వేడుకల ప్రారంభం
- కోరిన కోర్కెలు తీర్చే కుమార రామ భీమేశ్వరుడు



కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయం



కుమార రామభీమేశ్వరస్వామి

సామర్లకోట: రాష్ట్రంలో అతి ప్రాచీన పంచారామక్షేత్రాల్లో కుమారరామ భీమేశ్వర క్షేత్రం ఒకటి. పిఠాపురంలో లభించిన శాసనం ప్రకారం 9వ శతాబ్ది చివరిలో వేంగి చాళుక్య పాలకుడైన మొదటి చాళుక్య భీముడు ఈ ఆలయాన్ని నిర్మించిన్నట్లు తెలుస్తోంది. దాంతో ఈ ఆలయాన్ని చాళుక్య కుమారరామ భీమేశ్వరాలయంగా పిలుస్తున్నారు. ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి స్వామి వారి కల్యాణం జరిగింది. 19న రథోత్సవం జరగనుంది. 21వ తేది రాత్రి శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

శనిత్రయోదశి రోజునే మహాశివరాత్రి రావడం అరుదైన విషయమని పండితులు అంటున్నారు. దీంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని వారంటున్నారు. ఈ మేరకు ఆలయం వద్ద ఉచిత, దర్శనంతో పాటు రూ.30, రూ.50, రూ.100 దర్శనాలతో పాటు, అభిషేకానికి రూ.200, రుద్రాభిషేకానికి రూ.వెయ్యిగా నిర్ణయించారు. ఇప్పటికే క్యూలైన్లతో పాటు, వీఐపీలకు ప్రత్యేక నిచ్చెనలు ఏర్పాటు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు, ప్రైవేటు సెక్యూరిటీ ఏర్పాటు చేసినట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. ఉప్పువారి సత్రం నుంచి పాలు, మజ్జిగ, లయన్స్ క్లబ్ నుంచి అల్పాహారం, మజ్జిగ, పారిశ్రామిక వేత్త కర్రి వెంకట్రాజు వాటర్ ప్యాకెట్లు, 25 వేల మందికి భోజనాలు, వాసవీ ఫ్రెండ్స్ నుంచి భక్తులకు భోజనాలు, కొండపల్లి బ్రదర్స్ పేరున పాలు, మజ్జిగ పంపిణీ చేయడానికి ఇప్పటికే అధికారుల నుంచి అనుమతి పొందారు. వేట్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, పెద్దాపురం అగ్నిమాపక సిబ్బంది ఆలయం వద్ద సిద్ధంగా ఉంటారని అధికారులు తెలిపారు.



బాలత్రిపుర సుందరీదేవి

స్వామి దర్శనం పాప పరిహారం



మహా శివరాత్రి నాడు పరమ శివుని దర్శిస్తే పాపాలు నశిస్తాయి. శనిత్రయోదశి రోజున మహాశివరాత్రి రావడం అరుదు. ఇక్కడి కుమార రామభీమేశ్వరుడిని యోగ లింగంగా పిలుస్తారు. దాంతో స్వామి వారిని కొరిన కొర్కెలు ఫలిస్తాయి.

– వేమూరి సోమేశ్వరశర్మ, అభిషేక పండితుడు, సామర్లకోట

భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



ఆలయానికి వచ్చి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. కోనేరులో ఇసుక వేసి నీటిని మార్చాం. కోనేరు వద్ద గజ ఈతగాళ్లను నియమించాం. భక్తులకు ఉచిత ప్రసాదం, తాగునీరు, మజ్జిగ, పాలు పంపిణీకి దాతలు ముందుకు వచ్చారు.

– డి.నాగమల్లేశ్వరరావు, ఈఓ, పంచారామక్షేత్రం, సామర్లకోట

భక్తులకు ఇబ్బంది రానీయొద్దు : ఎస్పీ



పంచారామ క్షేత్రం వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

సామర్లకోట: భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పోలీసు సిబ్బంది చూడాలని జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్‌లతో కలసి ఏర్పాట్లపై చర్చించారు. ఈ మేరకు స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఎస్పీకి ఆశీర్వచనాలు అందజేశారు. సిబ్బందికి కేటాయించిన ప్రదేశాలల్లో విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. నేరాలు జరుగకుండా క్రైమ్ పార్టీ చూడాలని సూచించారు. ఆలయం వద్ద ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, 220 మంది పోలీసు, హోమ్‌గార్డులను నియమించినట్లు తెలిపారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ కె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాదగయలో ఏర్పాట్లు పూర్తి



పాదగయ క్షేత్రంలో సిద్ధమైన క్యూలైన్లు

పిఠాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం కుక్కుటేశ్వర స్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీదేవికి లక్షకుంకుమార్చన, లక్షచామంతి పూజ నిర్వహించారు. పండితులు ఉదయం 8 గంటలకు స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకం నిర్వహించి సాయంత్రం గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పాదగయ క్షేత్రాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

భారీగా భద్రతా ఏర్పాట్లు

మహాశివరాత్రి ఉత్సవాల్లో పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌర్యం కలగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పాదగయ ప్రాంగణంతో పాటు చుట్టు పక్కల అన్ని ప్రాంతాల్లోను నిఘా ఏర్పాటు చేశారు. 32 సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాలతో పరిస్థితిని సమీక్షించనున్నట్లు ఆమె తెలిపారు. ముగ్గురు సీఐలతో పాటు 15 మంది ఎస్సైలు 280 మంది పోలీసు సిబ్బందితో పట్టణంలో అన్ని ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఆలయ సమీపంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. భక్తుల వస్తువులు దొంగతనాలకు గురికాకుండా ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

పుణ్య స్నానాలకు ఏర్పాట్లు

పాదగయ పుష్కరిణిలో మహాశివరాత్రి పుణ్యస్నానాలకు సర్వం సిద్ధం చేశారు. శనివారం సుమారు 4 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే పుష్కరిణి చుట్టూ ఖాళీ ప్రదేశాన్ని విస్తరించారు. జిల్లాలోని అన్ని శైవక్షేత్రాల కంటే ఇక్కడ పాదగయ పుష్కరిణి ఉండడం వల్ల భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

దేదీప్యమానం

పిఠాపురం: పిఠాపురంలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన పాదగయ కుక్కుటేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దేదీప్యమానంగా వెలుగొందుతోంది. విద్యుద్దీపాలంకరణలో కళకళలాడుతూ భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తుతోంది. మహా శివరాత్రికి ఆలయాన్ని అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. ఆదిదేవుడి దివ్య కల్యాణం కనుల పండువగా జరగ్గా మహా శివరాత్రి పుణ్యస్నానాలకు సర్వం సిద్ధమైంది.



విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న పాదగయ పుష్కరిణి



బైపాస్ రోడ్డులో విద్యుద్దీపాల సెట్టింగులతో స్వాగత ద్వారం



రామాలయ ప్రారంభోత్సవానికి చాగంటికి ఆహ్వానం



చాగంటి కోటేశ్వరరావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న రాజా, శ్రీనివాస్

పెద్దాపురం: వచ్చే నెల 8న స్థానిక నాయీ బ్రాహ్మణ కాలనీలో నిర్వహించే కోదండరామ ఆలయ ప్రారంభోత్సవానికి చాగంటి కోటేశ్వరరావు హాజరుకానున్నట్లు వార్డు కౌన్సిలర్ విడదాసరి రాజా తెలిపారు. శుక్రవారం ఆయన రామాలయ కమిటీతో కలసి చాగంటి కోటేశ్వరరావుకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. పట్టణంలో రామాలయ ప్రతిష్ఠ అనంతరం ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారని రాజా తెలిపారు. ఆయన వెంట తమిరి శ్రీనివాస్, రాకుర్తి పుల్లయ్య, నాగబాబు తదితరులున్నారు.

వృక్ష విలాపం



ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో నరికిన వృక్షాలు

కొత్తపల్లి: అటవీ, విద్యుత్ శాఖ అధికారుల సమన్వయ లోపం వల్ల వృక్ష సంపద హననానికి గురవుతోంది. కష్టపడి పెంచిన మొక్కలపై అటవీ శాఖ అధికారులు కరుణ చూపకపోవడం ఒక తీరైతే, ఒకరికి వెలుగులు నింపేందుకు పచ్చని చెట్ల ప్రాణం తీయడమే పనిగా పెట్టుకునే విద్యుత్ శాఖది మరొక తీరు. ఈ రెండు శాఖల మధ్య కనీస అవగాహన లేకపోవడం అత్యంత బాధకరం. మండలంలో ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో మొక్కలు ఏపుగా పెరిగి రహదారికి ఇరువైపులా సుందరంగా దర్శనమిస్తూ ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కాగా విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడుతున్నాయనే నెపంతో ఆ శాఖ అధికారులు చెట్లను నరికివేశారు. విద్యుత్ తీగలపై పడిన కొమ్మలను మాత్రమే తొలగించకుండా చెట్లను సైతం ఇష్టానుసారం నరికి వేసి ధ్వంసం చేశారు. విద్యుత్ తీగల కింద మొక్కలు నాటినప్పడు నోరుమెదపని విద్యుత్‌శాఖ అధికారులు వృక్షాలుగా మారిన తరువాత వాటిని నరికివేయడంపై ప్రకృతి ప్రేమికులు మండి పడుతున్నారు.

హస్త కళాకారులను ప్రోత్సహించాలి : జేసీ ఇలక్కియ



ప్రదర్శనలో చీరలు పరిశీలిస్తున్న జేసీ ఇలక్కియ

బోట్‌క్లబ్: హస్త కళాకారులను ప్రోత్సహించాలని జేసీ ఇలక్కియ అన్నారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని డీసీఎంఎస్ గ్రౌండ్‌లో లేపాక్షి హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శనను శుక్రవారం ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. హస్తకళలకు విస్తృత ప్రచారం కల్పించడం, అభివృద్ధి, హస్తకళలపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు రాష్ట్ర హస్తకళ అభివృద్ధి సంస్థ సహకారంతో కాకినాడలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. శుక్రవారం నుంచి 26 వరకూ ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, నర్సాపూర్, జైపూర్, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో తయారుచేసిన వస్తువులతో 50 స్టాళ్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, ఇతర హస్తకళల వస్తువులతో పాటు కళంకారి, పోచంపల్లి వంటి ప్రాంతాలకు చెందిన చేనేత వస్త్రాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన, విక్రయాలను కాకినాడ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆమె స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ మంజుల, లేపాక్షి షోరూం మేనేజర్ వీరబాబు పాల్గొన్నారు.

పర్యావరణంలో అలుగుల పాత్ర ప్రత్యేకం

కలెక్టర్ కృతికా శుక్లా



పాంగోలిన్ పరిరక్షణపై రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఈ నెల 18న ప్రపంచ పాంగోలిన్ (అలుగు) దినోత్సవం సందర్భంగా ఈ జీవి పరిరక్షణపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు కన్జర్వేషన్ బయాలజిస్టు డాక్టర్ ఈశ్వర్ నారాయణ రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా ఆవిష్కరించారు. జీవ వైవిధ్యం పరంగా విశిష్టత, ప్రత్యేకత కలిగిన పాంగోలిన్ పర్యావరణానికి అందిస్తున్న సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. అంతరించిపోతున్న జీవజాతుల జాబితాలో ఉన్న అలుగుల సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏటా ఫిబ్రవరి, మూడో శనివారం ప్రపంచ పాంగోలిన్ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు డాక్టర్ ఈశ్వర్‌నారాయణ తెలిపారు. అలుగులు–పర్యావరణ ప్రాముఖ్యతపై శుక్రవారం మధ్యాహ్నం ఆదిత్య విద్యా సంస్థల విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించినట్లు వెల్లడించారు.

చేనేత సంఘాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: చేనేత సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులను శుక్రవారం పిఠాపురంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకం ద్వారా నిరుపేద నేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నారన్నారు. చేనేత సహకార సంఘాలకు తగినన్ని నిధులు కేటాయించి, వాటిని మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గొల్లప్రోలు చేనేత సహకార సంఘానికి చైర్మన్‌గా బండారు బాబూరావు, సభ్యులుగా అంది సత్యనారాయణ, వల్భదాసు వెంకటరమణ, మొండి కనకమహాలక్ష్మి, సూరిశెట్టి సూరిబాబులను నియమిస్తూ కాకినాడ చేనేత జౌళీ శాఖ అధికారి కె.పెద్దిరాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. సభ్యులందరూ శక్తి వంచన లేకుండా సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. సంఘానికి తన వంతు సహకారం ఎప్పుడు ఉంటుందని, ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మొగలి బాబ్జి, తెల్లపు చిన్నారావు, సొసైటీ అధ్యక్షుడు జ్యోతుల భీముడు, కౌన్సిలర్లు మొగలి అయ్యారావు, గంటా అప్పలస్వామి, మొగలి దొరబాబు, చక్కపల్లి దివాణం, సచివాలయ కన్వీనర్ మొగలి సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు జాగు వెంకటేశ్వరరావు, వల్లభదాసు సత్తిబాబు, జాగు మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



1974-75 బ్యాచ్ విద్యార్థులు

సామర్లకోట: స్థానిక అయోధ్యరామపురంలోని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 1974–75వ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు శుక్రవారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఈ మేరకు 49 సంవత్సరాల కిత్రం సంఘటనలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు.

22న బీసీ జనభేరి

బోట్‌క్లబ్: బీసీ హక్కుల సాధనకు ఈ నెల 22న మంగళగిరిలో చేపట్టే బీసీ జనభేరిని విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీసేన ఉపాధ్యక్షులు యనమదల రవి కోరారు. కాకినాడలో బీసీ సేన వాల్‌పోస్టర్‌ను నాయకులు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు శుక్రవారం రామారావుపేటలో ఆవిష్కరించారు. రాష్ట్రంలో బీసీ గణన చేపట్టేలా సీఎం జగన్ చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరిలో జరిగే జనభేరికి బీసీ సేన అధ్యక్షులు శొంటి నాగరాజు అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథిగా ఎంపీ ఆర్ కృష్ణయ్య హాజరవుతారన్నారు. బీసీ సేన జిల్లా అధ్యక్షుడు కండేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ బీసీ సమస్యలపై ఈ సభలో చర్చిస్తామన్నామన్నారు. బీసీ నాయకులు కొప్పిశెట్టి చంద్రమౌళి, వాసంశెట్టి రాజేశ్వరరావు, ధోని చిట్టిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ టవర్ల నిర్మాణాలకు సహకరించాలి



గొల్లప్రోలులో రైతులతో చర్చిస్తున్న ఆర్డీఓ రమణ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఎ.విజయనగరం, మల్లవరం గ్రామాల్లో ఏపీ ట్రాన్స్‌కో నిర్మించతలపెట్టిన హైటెన్షన్ విద్యుత్ టవర్ల నిర్మాణాలకు స్థానిక రైతులు సహకరించాలని కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ కోరారు. గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. హైటెన్షన్ విద్యుత్ టవర్ల నిర్మాణాలకు గొల్లప్రోలు మండలంలోని ఎ.విజయనగరం, మల్లవరం గ్రామాల్లో సుమారు 60 సెంట్ల భూమి అవసరమవుతుందని తెలిపారు. ఆ భూములు కోల్పోతున్న రైతులకు ఇచ్చే నష్ట పరిహారంపై ఆయన రైతులతో చర్చించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్‌వీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో ఏఎంజీ పాఠశాలలో జిల్లా సైన్స్ ఫేర్

కాకినాడ సిటీ: ఈనెల 22, 23 తేదీల్లో ఏఎంజీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లా స్థాయి సైన్సు ఫేర్‌కు తీసుకోవల్సిన చర్యలపై డీఈఓ అన్నపూర్ణ కమిటీలు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్ర ఏఎస్ఏ సమావేశ మందిరంలో ఆమె మాట్లాడారు. జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌ను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సైన్స్ ఫేర్‌కు జిల్లాలో 21 మండలాల నుంచి 105 ప్రాజెక్టులు, 5 సబ్ థీమ్‌లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాకినాడ అర్బన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జెడీ రాజు మాట్లాడుతూ సైన్స్ ఫేర్ నిర్వహణ బాధ్యతలకు కమిటీల ఏర్పాటు, కమిటీలు నిర్వర్తించే పనులను తెలియజేశారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, అర్బన్ డీఐ వీపీజీ వాణీకుమారి, రూరల్ మండల ఎంఈవో ఎల్.గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.